క్లుప్తంగా

సీపీని కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి



దాబాగార్డెన్స్ : విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ. రవిశంకర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జీవీఎంసీ ఉద్యోగులకు కమిషనర్ అభినందన



ఉద్యోగులను అభినందిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ ఉద్యోగులకు ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్‌లో స్థానం దక్కింది. అసోసియేషన్‌లో జీవీఎంసీ సూపరింటెండెంట్ అక్కరబోయిన అప్పలరాజు జనరల్ సెక్రటరీగా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ముద్దల రవి కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అసోసియేషన్‌లో స్థానం దక్కించుకున్న జీవీఎంసీ ఉద్యోగులను అభినందించారు. జీవీఎంసీ జెమ్స్ భవనంలో మంగళవారం సాయంత్రం మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు అప్పలనాయుడు నేతృత్వంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వామనరావు ఆధ్వర్యంలో పదవులు పొందిన వారంతా కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

శారదాపీఠాన్ని సందర్శించిన సీపీ రవిశంకర్



స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న సీపీ రవిశంకర్

సింహాచలం: చినముషిడివాడలోని విశాఖ శ్రీ శారదాపీఠాన్ని మంగళవారం నగర సీపీ రవిశంకర్ సందర్శించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజశ్యామల అమ్మవారిని దర్శించుకున్నారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కమిషనర్‌తో పాటు డీసీపీలు శ్రీనివాసరావు, ఆనంద రెడ్డి, నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి స్వామీజీలను కలిశారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వేంజేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కష్ణశర్మ పూజలను నిర్వహించారు.

ప్రజారోగ్యమే సీఎం జగన్ ధ్యేయం

ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి సీఎం జగన్ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని 33వ వార్డు పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అతిథులు పేర్కొన్నారు. 255 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. మరింత మెరుగైన చికిత్స అవసరమైన వారిని కేజీహెచ్‌కు, నెట్‌వర్క్ ఆస్పత్రికి తరలించారు. ముఖ్యమంత్రి తమపై కనబరుస్తున్న శ్రద్ధకు పేదసాద మురిసిపోయారు.

- 33వ వార్డు పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష
- 255 మందికి వైద్య పరీక్షల నిర్వహణ
- మెరుగైన చికిత్స అవసరమైన వారిని కేజీహెచ్, నెట్‌వర్క్ ఆస్పత్రికి తరలింపు



చిరుధాన్యాల స్టాల్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, రంథి గోపి, ఆడారి మహేష్ తదితరులు

అల్లిపురం : ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. జీవీఎంసీ 33వ వార్డు గౌరీవీధి సచివాలయం పరిధిలో గల జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో ఎంపికైన వారికి కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు 33,34,35,41 వార్డుల క్లస్టర్ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, 33వ వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ, పార్టీ పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 255 మంది వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. వారిలో ముగ్గురిని మరింత మెరుగైన వైద్యం నిమిత్తం ఇద్దరిని కేజీహెచ్‌కు, ఒకరిని నెట్‌వర్క్ ఆస్పత్రికి పంపించారు. మిగిలిన వారికి ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, గైనకాలజీ వైద్యులు పరీక్షించి, మందులు అందజేశారు.



కొబ్బరితోట పీహెచ్‌సీలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొన్న వైద్య సిబ్బంది, జెడ్సీ శివప్రసాద్, నీలకంఠం, బొడ్డేటి తదితరులు

పోషకాహారంపై అవగాహన..

గర్భిణులు, బాలింతలు, మహిళలకు అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరుధాన్యాలు, రాగిపిండి, పాల ప్రయోజనాలను వివరించారు. ప్రతి రోజు ఒక గుడ్డు తీసుకోవాలని, మునగాకు, తోటకూర, బచ్చలికూర వంటి ఆకుకూరలు తరచూ తీసుకోవడం వలన కలిగే లాభాల గురించి సమగ్రంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో గౌరీవీధి సచివాలయం పరిధిలో గల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రమ వాసులకు బంగారు వస్తువుల అందజేత

జగదాంబ : పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో ఆశ్రయం పొందుతున్న పలువురు ఆశ్రమ వాసులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా బంగారు వస్తువులు అందజేశారు. ప్రతి నెలా వచ్చే వైఎస్సార్ వృద్ధాప్య పెన్షన్ డబ్బులో అవసరం మేరకు వృద్ధులు ఖర్చు పెట్టుకోగా, సంస్థ కొంత డబ్బును జోడించి ప్రతి సంవత్సరం వారి పేరిట వస్తువులు కొనుగోలు చేసి వారికి అందిస్తోంది. దీనిలో భాగంగా ఈ ఏడాది దసరా సందర్భంగా ఆశ్రమ వాసులకు ఎమ్మెల్యే వాసుపల్లి చేతుల మీదుగా బంగారు వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆశ్రమ వాసులకు బంగారం కొనడం, వృద్ధులను తల్లిదండ్రుల వలే చూసుకుంటూ, వారి సంరక్షణ బాధ్యతలు చక్కగా నిర్వహిస్తున్న సంస్థను, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులను కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ మాట్లాడుతూ ఆశ్రమ వాసులకు బంగారం సమకూర్చడం ద్వారా చివరి క్షణంలోనైనా వారి పిల్లలు, బంధువులు వస్తారని సంస్థకు, వృద్ధులకు చిన్న ఆశ అన్నారు. ఎన్నో ఆశ్రమాలు ఉన్నాయి కానీ బంగారం కొనడం, దాతల సహకారంతో ప్రతి సంవత్సరం ఆధ్యాత్మిక యాత్రలకు తీసుకెళ్లడం ఒక్క వివేకానంద సంస్థకే సాధ్యమన్నారు. అనంతరం ట్యూషన్ పిల్లలు, నిరంతరం సేవలందిస్తున్న సంస్థ సభ్యులకు దసరా సందర్భంగా బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్, ముస్లిం నాయకుడు ముజీబ్‌ఖాన్, బాబ్జి, సంస్థ సభ్యులు సత్తిబాబు, అప్పలకొండ, పైడిరాజు, నూకరాజు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.



బంగారు వస్తువులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, శ్రీవత్సవ్

వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోవేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

తాటిచెట్లపాలెంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలి

జీవీఎంసీ కమిషనర్‌కు బాలల హక్కుల కమీషన్ వినతి

విశాఖ విద్య : నగరంలోని తాటిచెట్లపాలెంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో హైస్కూల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ సభ్యుడు డాక్టర్ జి. సీతారాం కోరారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మను కలిసి చర్చించారు. తాటిచెట్లపాలెంలో పోర్టు యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న హైస్కూల్‌ను వచ్చే ఏడాది మూసివేస్తారని ప్రచారం జరుగుతోందని, దీనిపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఇదే జరిగితే తాటిచెట్లపాలెం పరిసర కాలనీలకు చెందిన పేద విద్యార్థులు హైస్కూల్ చదువులకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఇక్కడి విద్యార్థులు వేరే స్కూల్‌కు వెళ్లాలంటే మూడు కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. పోర్టు యాజమాన్యం స్కూల్ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకున్నట్‌లైతే, పేద విద్యార్థులు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో జీవీఎంసీ ద్వారా స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు. తాటిచెట్లపాలెం ప్రాంత వాసుల తరఫున కమిషనర్‌కు బాలల హక్కుల కమీషన్ ద్వారా లేఖ అందజేశారు. ఈ విషయం కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి, మున్సిపల్ విద్యాశాఖ అధికారులతో చర్చిస్తామని కమిషనర్ సాయికాంత్‌వర్మ హామీ ఇచ్చినట్లు సీతారాం తెలిపారు.



కమిషనర్‌తో చర్చిస్తున్న డాక్టర్ సీతారాం

ఖడ్గధారిణి చండీ.. దుర్గాదేవి నమోస్తుతే



సుహాసిని పూజలో పాల్గొన్న మహిళలు



భక్తులను ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



సాగరగిరి కనకదుర్గమ్మ

సుహాసిని పూజలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్‌లో వెలసిన కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం గాయత్రీదేవిగా కన్యకాపరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మచే సామూహిక సుహాసిని పూజ నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కడిమిశెట్టి జ్యోతిర్మయి, కంచర్ల శిరీషచే వాసవీ కన్యకా పరమేశ్వరి జీవిత చరిత్ర గానామృత కార్యక్రమం నిర్వహించారు. బుధవారం కన్యకాపరమేశ్వరి రాజరాజేశ్వరిగా దర్శనమివ్వనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆరిశెట్టి దినకర్, గ్రంధి రామకృష్ణారావు, పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గు అరుణ్‌కుమార్, దోమా వెంకట సతీష్‌కుమార్, కంకటాల సతీష్, దేవస్థానం మహిళా విభాగం సభ్యులు కట్టమూరి ప్రసన్న, కుంచం సత్యవతి, పి. సుజాత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీచ్‌రోడ్డు ఆర్కే బీచ్ కాళీ మాతా ఆలయం వద్ద మంగళవారం సాయంతరం నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. నాట్యదీపిక కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు ఎల్. ఇంద్రాణి నరేంద్ర నేతృత్వంలో పిల్లలు కూచిపూడి నాట్యం చేశారు.

అన్నపూర్ణాదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ

అల్లిపురం : యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకుడు ఫణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.

నిమ్మకాయల అలంకరణలో ఎర్నిమాంబ..

కంచరపాలెం : జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం నిమ్మకాయల అలంకారంలో దర్శనమిచ్చారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ అవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షించారు.

పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ దేవస్థానంలో..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ జంక్షన్‌లో గల శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల మూడో రోజు మంగళవారం అమ్మవారిని శ్రీ గాయత్రీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో పి.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు సకల సదుపాయాలు కల్పించారు. దేవస్థానం అర్చకులు అమర్‌నాథ్, కృష్ణ అమ్మవారికి పూజలు నిర్వహించారు. రోజూ సాయంత్రం దేవస్థానం ఆవరణలో భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా దేవస్థానం పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బత్తి మంగరాజు, ధర్మకర్తలు డి.లక్ష్మీనారాయణ, కె.వరలక్ష్మి, వెంకటలక్ష్మి, రమణమ్మ, డి.వేణుగోపాల్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఆర్థిక సాయం..

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 42వ వార్డు పరిధి రైల్వే న్యూకాలనీ, ఇందిరాగాంధీ కాలనీలో గల ఐజీసీ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు.



గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి



నిమ్మకాయల అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు



గాయత్రీదేవిగా దుర్గాలమ్మ అమ్మవారు

'ప్రార్థనా మందిరాలు కూల్చొద్దు'

జగదాంబ : జీవీఎంసీ 39వ వార్డు కోటవీధిలో గల ప్రార్థనా మందిరాలను కూల్చొద్దని వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిఖ్ కోరారు. వార్డులోని విశాఖ మదీనా హౌల్యా దర్గా షరీఫ్ వద్ద స్థానిక ప్రజలు ఆయనకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మశీదు వద్ద వారు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ వార్డులో రోడ్డు విస్తరణలో భాగంగా ఇక్కడి మశీదు, దేవాలయాల్లో కొంత భాగం కూల్చివేతకుగాను జోన్-4 అధికారులు మార్కింగ్ చేశారని తెలిపారు. కాని ఇక్కడి ప్రజలు తరతరాలుగా మశీదు, దేవాలయాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పూర్వీకులు నిర్మించిన ప్రార్థన మందిరాలు, ఇళ్లను కూల్చివేయడం సెంటిమెంట్ దెబ్బతీయడమే అన్నారు. ఘోషాస్పత్రి నుంచి యాసిన్ బాబా దర్గా మీదుగా బీచ్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ చేపట్టారని తెలిపారు. శతాబ్దాల చరిత్ర గల ప్రార్థనా మందిరాలను కూల్చివేస్తామనడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కోటవీధి ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న స్థానికులు

తెలంగాణ తరహాలో పథకాలు అమలు చేస్తాం

బీఆర్‌ఎస్ ఏపీ నాయకులు

దాబాగార్డెన్స్: తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేస్తామని బీఆర్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ నాయకులు జేటీ రామారావు, తలారి సురేష్, మద్దిశెట్టి సురేష్, కరణం రామ్మోహన్‌నాయుడు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ తెలంగాణ రాష్ట్ర మేనిఫెస్టోను వారు విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కి రాష్ట్రంలో అవకాశం ఇస్తే రైతుబంధు, ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, సౌభాగ్యలక్ష్మి, కేసీఆర్ బీమా, సబ్సిడీతో వంటగ్యాస్, అన్నపూర్ణ పథకం, అసైన్డ్ భూములపై హక్కు తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పోటీ చేస్తుందన్నారు. అలాగే పార్లమెంట్‌కు కూడా బీఆర్‌ఎస్ పోటీ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో గుల్లపల్లి తిరుపతినాయుడు, గురువు నారాయణరావు, వేమిరెడ్డి గణపతిరావు, కేవీ రమణమూర్తి, నీలకంఠం, ఆర్.తాతారావు పాల్గొన్నారు.



తెలంగాణ మేనిఫెస్టో విడుదల చేసి మాట్లాడుతున్న జేటీ రామారావు

రొమ్ము క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం

సీతమ్మధార : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రొమ్ము క్యాన్సర్‌ను నయం చేయవచ్చని మహాత్మా గాంధీ క్యాన్సర్ రీసెర్చి హాస్పటల్ అధినేత డాక్టర్ వూన మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆశీలమెట్టలోని ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌లలో అత్యాధునిక తర్ఫీదు పొందిన అంకాలజిస్టులు అందుబాటులో ఉన్నారన్నారు. 18 ఏళ్లుగా 8,500 మంది రొమ్ము క్యాన్సర్ బాధితులకు విజయవంతంగా చికిత్సలు చేసినట్టు తెలిపారు. రొమ్ము క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యగా మారిందన్నారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్యసేవలందిస్తోందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మహాత్మాగాంధీ క్యాన్సర్ రీసెర్చ్ హాస్పటల్ అధినేత మురళీకృష్ణ

ఐక్యూఏసీ సమావేశ మందిరం ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ)లో నూతన సమావేశ మందిరం (బోర్డ్ రూమ్)ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మంగళవారం ప్రారంభించారు. వివిధ సంస్థల ప్రతినిధులు తరచూ ఏయూ ఐక్యూఏసీ కార్యాలయాన్ని సందర్శిస్తుంటారు. వారితో చర్చించడానికి ఉపయుక్తంగా ఆధునిక వసతులతో దీనిని తీర్చిదిద్దారు. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్, టి.శోభశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

కౌన్సిల్ సమావేశం రెండు రోజులు నిర్వహించాలి

దాబాగార్డెన్స్ : కౌన్సిల్ సమావేశం నెలకోసారైనా.. లేదా కనీసం రెండు రోజులైనా నిర్వహించాలని జనసేన పార్టీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దల్లి గోవిందరెడ్డి, ఆ పార్టీ కార్పొరేటర్లు పీతల మూర్తి యాదవ్, కందుల నాగరాజు కోరారు. జీవీఎంసీలో గల జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ కార్యాలయంలో మంగళవారం షాడో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశానికి తక్కువ సమయమే ఉంటుందని, సమస్యలు మొర పెట్టుకోవడానికి జీరో అవర్ కూడా చాలడం లేదన్నారు.

పవర్ లిఫ్టింగ్ విజేతలకు అభినందన

మద్రిపాలెం : పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు సాధించిన విజేతలను ఆర్కే ఫిట్‌నెస్ మంత్ర అధినేత గున్న రామకృష్ణారావు అభినందించారు. ఈ నెల 5 నుంచి 10 వరకు నేపాల్‌లో జరిగిన ఎస్‌బీకేఎఫ్ 8వ అంతర్జాతీయ క్రీడల్లో గోల్డ్‌మెడల్ సాధించిన సీహెచ్ అప్పలరాజు, ఆర్ గణేష్, ఆర్.కుమార్, నారాయణ, సుధాకర్‌లను ఈ సందర్భంగా మంగళవారం ఆయన కార్యాలయంలో వారిని సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలమరశెట్టి శ్రీనివాసరావు, రాపేటి రాము, కోన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విధానాలతో పేదరిక నిర్మూలన సాధ్యం

ఏయూ క్యాంపస్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విధానాలతో పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. మంగళవారం సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతదేశంలో పేదరికం- సమస్యలు, నిర్మూలన వ్యూహాలు అనే అంశంపై జాతీయ వెబ్‌నార్ జరిగింది. వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ సదస్సులో రిజిస్ట్రార్ మాట్లాడుతూ పేదరికాన్ని అన్ని విధాలా నిర్మూలించాలన్న అంబేడ్కర్ సిద్ధాంతాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని కొనియాడారు. కేంద్రం డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ పేదరికం అనేది కేవలం ఆర్థిక సమస్య కాదన్నారు. ఏయూ ఆంత్రోపాలజీ డిపార్ట్‌మెంట్ ఎమెరిటస్ ప్రొఫెసర్ వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పేదరికం స్థాయిలు గ్రామీణ, గిరిజన, పట్టణ ప్రాంతాల వారీగా మారుతుంటాయన్నారు. ఏయూ రాజనీతి శాస్త్రం-పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పీహెచ్‌డీ డాక్టర్ సులేమాన్ మాట్లాడుతూ ఆదాయ అసమానతలు, మురికివాడల్లో నివాసం ఉండడం పట్టణ పేదరికానికి ఉదాహరణ అన్నారు. ఉపాధి హామీ పథకం, ప్రధాన్ మంత్రి జన్‌ధన్ యోజన, నగదు బదిలీ కార్యక్రమాలు, సమాచారం-విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉద్యోగ కల్పన, నైపుణ్యాల అభివృద్ధి వంటి పథకాలు పేదరిక నిర్మూలనకు కీలకమన్నారు. ఈ సదస్సులో 150 మంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పటిష్టమైన బోధనతో మెరుగైన సమాజం

ఏయూ క్యాంపస్: పటిష్టమైన బోధన వ్యవస్థతో మెరుగైన సమాజం నిర్మాణం సాధ్యపడుతుందని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ ఐఏఎస్‌ఈ ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలరం దూరవిద్య బీఈడీ విద్యార్థుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశ ప్రగతికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారన్నారు. జాతీయ నూతన విద్యా విధానం లక్ష్యాలను చేరుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ మాట్లాడుతూ భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. శిక్షణ తరగతుల సమన్వయకర్త ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ బీఈడీ చదివే ప్రతి విద్యార్థికి బోధన విధానాలు, చిన్నారుల మానసిక పరిణితి, సోషియాలజీ, ఫిలాసఫీ వంటి అంశాలను అవగాహన కల్పిస్తామన్నారు. ఆచార్య డి.నాగరాజకుమారి మాట్లాడుతూ ఐదు రోజుల వర్క్‌షాప్‌లో అందించే శిక్షణ కార్యక్రమాన్ని వివరించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహారావు